వేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణం

జిల్లాలోనే ముందంజలో తెనాలి నియోజకవర్గం

తెనాలిరూరల్: పేదల ఇళ్ల నిర్మాణం పరుగులు పెడుతోంది. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా తెనాలి నియోజకవర్గంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతోంది. జిల్లాలోనే అత్యధికంగా ప్లాట్లను పేదలకు కేటాయించారు. బుర్రిపాలెం, నేలపాడు-1, నేలపాడు-2(గోలిడొంక), పేదరావూరు-1, పేదరావూరు-2 (జగ్గడిగుంటపాలెం) లేఅవుట్‌లు తెనాలి పరిధిలో అధికారులు ఏర్పాటు చేశారు. వీటిలో 23,856 ప్లాట్లు పేదలకు కేటాయించారు. ఇందులో మొదటి ఫేజ్‌లో 10,225 ఇళ్ల నిర్మాణానికి అధికారులు ఎంపిక చేశారు. తెనాలి అర్బన్‌లో 4,459, రూరల్‌లో 1296 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ దాటాయి. లెంటల్ లెవల్‌లో 11, రూఫ్‌లెవల్‌లో 38, శ్లాబ్ వేసినవి 18 ఉండగా 229 ఇళ్లు ఇప్పటికే నిర్మాణం పూర్తయ్యాయి. బుర్రిపాలెం లేఅవుట్‌లో 9,735 ప్లాట్లకు గాను 3,338 ప్లాట్లలో ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నేలపాడు-1లో 5,715కు 2,187, నేలపాడు-2లో 2,011కు 1800, పెదరావూరు-1లో 3,972 ప్లాట్లకు గాను అత్యధికంగా 1820, పెదరావూరు-2లో 2,603కు 1080 ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్లకు అప్పగించిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నిరంతరం అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ, కాంట్రాక్టర్లకు సూచనలిస్తూ ఇళ్ల నిర్మాణాలను పరుగులు పెట్టించేందుకు కృషి చేస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలో వీలైనన్ని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించి గృహ ప్రవేశాలు జరిపించేలా చూస్తున్నారు.


బుర్రిపాలెం లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు


జగనన్న కాలనీలో నిర్మాణం పూర్తయిన ఇల్లు

వీలైనన్ని ఎక్కువ ఇళ్లు పూర్తి చేయించేలా చర్యలు



ఏప్రిల్ నాటికి వీలైనన్ని ఎక్కువ జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తిచేయించి గృహ ప్రవేశాలు జరిపించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇళ్ల నిర్మాణంలో తెనాలి నియోజకవర్గం జిల్లాలోనే ముందంజలో ఉంది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సహకారంతో నిర్మాణాలను వేగవంతం చేస్తున్నాం. మౌలిక వసతులపైనా దృష్టి పెట్టాం.

–యడ్ల భాస్కరరావు, హౌసింగ్ ఈఈ

క్లుప్తంగా

నాటక కళాకారుడు ధర్మారావుకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం జీవితచక్రం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం కేడీ నెం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం నాటక కళాకారుడు, రచయిత, దర్శకుడు భూపతి ధర్మారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈదర వెంకటపూర్ణచంద్, వేములపల్లి సుబ్బారావు, నిడమానూరు వెంకటరత్నం, భూపతి నిర్మలాక్లారా, సోమవరపు సాంబశివరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిద్యాపీఠంలో ప్రత్యేక పూజలు



తెనాలిటౌన్: గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవిద్యాపీఠం నిర్వాహకులు బాలస్వామీజీ పర్యవేక్షణలో విష్ణుసహస్రనామ పారాయణం, శ్రీవారి సంకీర్తన సేవ, సప్త హారతులు, మంత్రపుష్పం జరిపారు. శోభకృత్ నామ సంవత్సర విశిష్టతను భక్తులకు బాలస్వామీజీ వివరించారు. కార్యక్రమంలో సాలిగ్రామ మఠం చైర్మన్ నంబూరు కృష్ణమూర్తి, వైస్ చైర్మన్ గుడివాడ శివప్రసాద్, జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, ఉప్పల నాగేశ్వరరావు, గొప్పు రామకృష్ణ, లోకనాధం, రాజేశ్వరరావు, నాగేశ్వరరావు, మాల్యాద్రి, శివరామకృష్ణ దంపతులు, లలితా సేవా సమితి, శ్రీవిద్యాపీఠం, శ్రీజయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

తెనాలిరూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన కూలీ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం మూల్పూరుకు చెందిన భవనాసి జయేంద్రధర్మ (19) భార్యతో కలసి వచ్చి రెండు నెలలుగా పట్టణంలోని చినరావూరులో ఉంటున్నాడు. పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురై ఈ నెల 14వ తేదీ ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేయగా, స్థానికులు గుంటూరు వైద్యశాలకు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

78 మందికి కంటి పరీక్షలు

తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో నిర్వహించారు. కంటి వెలుగు పారా మెడికల్ ఆప్తమాలిక్ అధికారి వి.వి.కర్ణ మాట్లాడుతూ ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 35 మందికి కళ్లజోళ్లు అవసరం అని గుర్తించామని, ఐదుగురికి కంటి ఆపరేషన్ నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశామని అన్నారు. ఇతర కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తపాలా జీవిత బీమా సద్వినియోగం చేసుకోవాలి

మంగళగిరి: గ్రామీణ తపాలా జీవిత బీమా సద్వినియోగం చేసుకోవాలని పోస్ట్‌మాస్టర్ నరసింహారెడ్డి కోరారు. గ్రామీణ తపాలా జీవిత బీమా దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలోని హెడ్ పోస్టాఫీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పీఎల్‌ఐ చేసేందుకు 18 నుంచి 55 సంవత్సరాలలోపు ఉన్న పౌరులు అర్హులని తెలిపారు. ఈ పథకంలో మిగిలిన ఇతర పథకాల కంటే అధిక బోనస్, తక్కువ ప్రీమియం ఉంటుందన్నారు. వీటన్నింటికీ 80 సీ కింద పన్ను రాయితీ ఉంటుందని, కావున ప్రజలు గ్రామీణ తపాలా జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాజ్యాధికార సాధన లక్ష్యంగా కార్యాచరణ

మంగళగిరి: రాజ్యాధికార సాధన లక్ష్యంగా దళిత, దళిత క్రైస్తవులు కార్యాచరణ రూపొందించనున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ రిటైర్డ్ డీఐజీ చావలి బాలస్వామి తెలిపారు. గురువారం నగర పరిధిలోని నవులూరు ఈడబ్ల్యూఎస్ గార్డెన్స్‌లో సీఎన్‌టీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. బాలస్వామి మాట్లాడుతూ దళితుల సమస్యలు సామాజిక సమస్యగానే కాకుండా అది రాజకీయ సమస్య కూడా అని తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాల ప్రతినిధులు పాస్టర్ సహదేవ్, న్యాయవాది రాయపూడి మణి, పచ్చిగళ్ల దేవానందరావు, మన్నే ఏసుదాసు, లార్డ్ వెస్లీ, బి రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మమేకం కావాలి


మాట్లాడుతున్న బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు

బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు

తెనాలిటౌన్: బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సేవా శిబిరం (ఎన్‌ఎస్‌ఎస్) ద్వారా విద్యార్థినులు గ్రామంలోని రైతులు, ప్రజలతో మమేకం కావాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్, ప్రొఫెసర్ డాక్టర్ వి.శ్రీనివాసరావు సూచించారు. ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ఆదేశాల మేరకు బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 29 వరకు రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రొఫెసర్ ప్రసన్నకుమారి సభకు అధ్యక్షత వహించారు. సభలో డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు అందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, వ్యవసాయ కళాశాల విద్యార్థులు శిబిరంలో పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలు అందివ్వాలన్నారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, నానో టెక్నాలజీ, రోడ్డు టెక్నాలజీ తదితర అంశాల గురించి రైతులకు వివరించాలన్నారు. ప్రొఫెసర్ శివన్నారాయణ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయంలో పాటించే ఆధునిక పద్ధతులు, పంట దిగుబడులు, ఖర్చులు గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రసన్నకుమారి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ద్వారా గ్రామంలో సామాజిక, ఆర్థిక సర్వే చేపడతామని చెప్పారు. వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న, ఎంపీటీసీలు డి.నాగదేవిక, చక్కా సీతమ్మ, ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు నాగరాజు మాట్లాడారు. సభలో ఆచార్య ఏఎన్‌యూ జియాలజీ విభాగాధిపతి డాక్టర్ పీజే రత్నాకర్, రైతులు కాలిశెట్టి అప్పారావు, తాళ్లూరి అచ్యుతరామయ్య, తులబంధుల శివనాగేశ్వరరావు, అరవపల్లి నాగేశ్వరరావు, వేజండ్ల రాధాకృష్ణమూర్తి, అంచె రోశయ్య, సూరవరపు శ్రీనివాస్‌రెడ్డి, విన్నపాల సీతయ్య, 30 మంది ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

కొల్లిపర: ఉర్దూ పాఠశాలలో జరిగే ప్రతి విషయాన్ని రికార్డులలో పొందుపర్చాలని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం అన్నారు. గురువారం మండల పరిధిలోని కొల్లిపర, మున్నంగి, పిడపర్రు గ్రామాల్లోని ఉర్దూ పాఠశాలలను ఎంఈవో లక్ష్మీనారాయణతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, నాడు-నేడు ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఎఫ్ఏ-4 ప్రశ్నాపత్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి మార్కులను ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులకు ఉర్దూలోనే పాఠ్యాంశాలు బోధించాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు ద్వారా పాఠశాలలు గతానికి భిన్నంగా నూతన హంగులతో ప్రశాంత వాతావరణం కల్పించేలా ఉండటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.


ఉర్దూ పాఠశాలలో విద్యార్థుల పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఉపతనిఖీ అధికారి ఖాసిం

ఉపాధ్యాయులకు సత్కారం

తెనాలి: శోభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా వేజళ్ల వెంకట సుబ్బారావు స్మారక విద్యా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. 2023 ఉగాది పురస్కారాన్ని పలు సాహితీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గౌరావఝుల ఆంజనేయశాస్త్రి దంపతులకు బహూకరించారు. వీరితో పాటు తెలుగు సాహిత్యంలో విశేష సేవలందిస్తున్న ఉపాధ్యాయులు శ్యామ్‌ప్రసాద్, షేక్ అబ్దుల్ హకీం జాని, అయినాల మల్లేశ్వరరావును సత్కరించారు. ట్రస్ట్ నిర్వాహకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అతిథులుగా వివేక విద్యాసంస్థల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు, ఓంకార్ గ్రాఫిక్స్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు ముప్వ వెంకటేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు ఝాన్సీలక్ష్మి, నవ్య పాల్గొన్నారు. ప్రకృతిని ప్రేమించండి, పర్యావరణాన్ని రక్షించండి అంటూ విచ్చేసిన ఆహూతులకు మొక్కలను పంపిణీ చేశారు.


సత్కారం అందుకున్న ఉపాధ్యాయులు

పోషణ పక్వాడాపై అవగాహన సదస్సులు

తెనాలిటౌన్: రూరల్ మండల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా కార్యక్రమంపై గురువారం అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. నందివెలుగు గ్రామంలో జరిగిన ర్యాలీలో గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందని, చిరుధాన్యాలపై అంగన్‌వాడీలకు అవగాహన కల్పించాలని కోరారు. సూపర్‌వైజర్ హిమబిందు మాట్లాడుతూ రక్తహీనత, పెరుగుదల తక్కువగా ఉన్న పిల్లల ఆరోగ్యం మెరుగుపడేందుకు చిరుధాన్యాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుభాష్ చంద్రబోసు, వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

- సంగంజాగర్లమూడి, కొలకలూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడాపై నిర్వహించిన అవగాహన సదస్సుల్లో సీడీపీవో డి.గీతాంజలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ చిరుధాన్యాల వాడకంపై అవగాహన కల్పిస్తామని, చిన్నారులకు చిరుధాన్యాలు ఆహారంగా అందించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యామిని, సంరక్షణ కార్యదర్శి మల్లిక, అంగన్‌వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, దుర్గాదేవి, సరోజిని, హేమలత పాల్గొన్నారు. సంగంజాగర్లమూడిలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ సౌజన్యశ్రీ, వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.
- పట్టణ చంద్రబాబునాయుడు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భిణులకు పోషణ గురించి, వ్యాధి నిరోధక టీకాలు గురించి, చిరుధాన్యాల గురించి అవగాహన కల్పించారు. వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మేరి యూనిస్ మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకత, పోషక ఆహారాలు లోపాలు సవరించుకునే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో జేఎంజే మహిళా కళాశాల గృహ విజ్ఞాన విభాగం అధిపతి పాటిబండ్ల హేమలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు సరోజిని, పుష్ప, కనకదుర్గ, రామలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


నందివెలుగులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్ పవన్‌కుమార్


గర్భిణులకు పోషకాహార పదార్థాలు అందజేస్తున్న డాక్టర్ మేరి యూనిస్, సూపర్‌వైజర్ సౌజన్య

స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపుతున్న మహిళలకు స్వచ్ఛత అవార్డులు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ ఎం.జశ్వంతరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్నతరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్‌ట్యాంక్‌ల శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్తసేకరణ, మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించే పద్ధతులు, చెత్తతో కళాకృతుల తయారీ, చెత్తతో సంపద తయారీ, పొడి చెత్తను వినూత్నరీతిలో వినియోగించడం, స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, తడి చెత్త వినియోగంతో కంపోస్టు తయారీ తదితర విభాగాల్లో అవార్డులు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు శుక్రవారం తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేయడం జరుగుతుందన్నారు.

ఆలయాల మాజీ చైర్మన్‌లు, అర్చకులకు సత్కారం



తెనాలిటౌన్: పట్టణ రైల్వేస్టేషన్ రోడ్డులోని కాకుమాను వెంకట సుబ్బయ్య ధర్మసత్రంలో బుధవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ధర్మసత్రం వంశపారంపర్య ధర్మకర్త కె.గిరిధర్ పర్యవేక్షణలో ఈవో ఎస్.మల్లీశ్వరి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో బసవ మందిరం మాజీ చైర్మన్ చుక్కా శ్రీనివాస్, రామ మందిరం మాజీ చైర్మన్ కన్నెగంటి గోపిచంద్, అర్చకులు తాడేపల్లి కోటేశ్వరశాస్త్రి, కాకాని చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.1,116లను ధర్మకర్త కె.గిరిధర్ అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు, సత్రం సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోండి



తెనాలిఅర్బన్: క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని ఎన్‌సీసీ గుంటూరు జిల్లా గ్రూపు కమాండర్ ఆర్.జయకుమార్ సూచించారు. ఎన్‌సీసీ అకాడమిక్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా గురువారం 22వ ఆంధ్రా బెటాలియన్ పరిధిలోని ఐతానగర్ ఎన్‌సీసీ బ్రాంచ్‌ని ఆయన తనిఖీ చేశారు. అకాడమిక్‌లో బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చిన మూడు స్కూళ్లను ఎంపిక చేసి ఆ స్కూల్స్‌లో మరింత ప్రతిభ కనపరచిన ఆరుగురు ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు ఒ.ఉమాశంకర్, కె.స్వామి, గోపి, అనిల్, హనుమంతరావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన ఆంజనేయం ధ్యాన యోగ మండలి ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని కోర్టుల ప్రాంగణంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కక్షిదారులు, న్యాయవాదుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు ముదావహమన్నారు. ధ్యాన యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ మాట్లాడుతూ తమ యోగ సభ్యుడు చింతలూరి నాగేశ్వరరావు వితరణతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్‌అబ్దుల్ షరీఫ్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, తాడిబోయిన శ్రీనివాసరావు, జగదీశ్వరాంబ, తాడికొండ శ్రీనివాసరావు, చింతలూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి మాలతి

వసంత నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం

తెనాలిటౌన్: బోసురోడ్డులోని హనుమాన్‌చౌక్‌లో వేంచేసిఉన్న సీతారామ మందిరంలో వసంత నవరాత్రి మహోత్సవాలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఉద్దంటి కనక సుందరరావు, భూలక్ష్మి దంపతులు ఆవిష్కరించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శాంతి కల్యాణం జరిపారు. ఉత్సవాలు ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగుతాయని మందిరం కోశాధికారి, కన్వీనర్ అక్కపెద్ది బాలగోపాల్, రత్నాకర్ శాస్త్రి తెలిపారు. దేవాలయ అర్చకులు బీవీ నరసింహమూర్తి, చిట్టి ఆంజనేయస్వామి అర్చకుల సహకారంతో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కమిటీ సభ్యులు బాలగోపాల్, రత్నాకర్ శాస్త్రి పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ నెల 30న సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సుందరరావు, భూలక్ష్మి దంపతులు

దాడి, దోపిడీ కేసులో జైలు, జరిమానా

తెనాలిరూరల్: దాడి, దోపిడీ కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2019 అక్టోబరు 9వ తేదీ రాత్రి తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం ప్రగడ కోటయ్య నగర్‌కు చెందిన జొన్నాదుల సుబ్రహ్మణ్యం వ్యక్తిగత పనులపై గుంటూరు వెళ్లాడు. అదే రోజు రాత్రి పొద్దుపోయాక తెనాలి వచ్చిన అతను టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద ఆటో ఎక్కాడు. అప్పటికే అందులో డ్రైవర్, మరో ఇద్దరు ఉన్నారు. చినరావూరు వైపు వెళ్లాల్సిఉన్నా, నాజరుపేట సనకా వారి కొట్లు బజారు వైపు తీసుకెళ్లి, సుబ్రహ్మణ్యంపై ముగ్గురూ దాడి చేసి, అతని వద్ద ఉన్న రూ.10,500, సెల్‌ఫోన్‌ను అపహరించుకెళ్లారు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేయగా, అప్పటి వన్‌టౌన్ సీఐ ఎం.రాజేష్‌కుమార్ కేసు నమోదు చేసి నిందితులను గుర్తించి కోర్టులో హాజరుపరిచారు. వీరిలో ఇద్దరు నిందితులకు గతంలోనే కోర్టు శిక్ష వేయగా, మరో నిందితుడు అరవపల్లి భువనేశ్వర్ అప్పట్లో పరారీలో ఉన్నాడు. ఏడాది క్రితం భువనేశ్వర్‌ను పోలీసుల పట్టుకోగా, ఇతనిపై ట్రయల్ ప్రారంభించారు. కేసు గురువారం విచారణకు వచ్చింది. కోర్టు కానిస్టేబుల్ సింహాద్రి శివకోటేశ్వరరావు సాక్ష్యులను కోర్టులో హాజరుపరిచారు. సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. సాక్షాధారాలను పరిశీలించిన మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా, నిందితుడు భువనేశ్వర్‌కు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

భగత్‌సింగ్ ఆశయాలు ఆదర్శనీయం


భగత్‌సింగ్‌కు అంజలిఘటిస్తున్న ఆర్‌వైఏ ప్రతినిధులు


నివాళులర్పిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

తెనాలిఅర్బన్: భగత్‌సింగ్ ఆశయాలకు అనుగుణంగా అందరూ పనిచేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ పేర్కొన్నారు. భగత్‌సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగర్, శివాజీచౌక్‌లోని భగత్‌సింగ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ బానిస సంకెళ్ల నుంచి విముక్తి కలిగించే ప్రయత్నంలో ఆయన తన ప్రాణాలను అర్పించారని తెలిపారు. భగత్‌సింగ్ వంటి గొప్ప వ్యక్తులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించడంతో పాటు వర్ధంతి, జయంతిని ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి బిళ్ల రాజేష్, నియోజకవర్గ కార్యదర్శి పల్నాటి నాగరాజు, నాయకులు సీహెచ్ సాయి, శశి, ఎం.శివ, మధు, నరేంద్ర, శ్రీను, గోపి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- భగత్‌సింగ్ వర్ధంతిని రెవల్యూషన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి అంజలిఘటించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్ పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాగమణి, ఉదయకిరణ్, రామ్‌దేవ్, బెన్నహార్, సుధీర్, జయ వెంకటేష్, బాషా, చంటి తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయం శిఖర ప్రతిష్టా మహోత్సవం

మంగళగిరి: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కాజలో కోదండ రామాలయం నూతన విమాన శిఖర ప్రతిష్ట గురువారం ఘనంగా నిర్వహించారు. దాతలు సింహాద్రి వెంకటరామారెడ్డి, స్వాతి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మహా కుంభాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రేషన్ సకాలంలో సరఫరా చేయాలి

మంగళగిరి: రేషన్ దుకాణాలకు సరుకు సకాలంలో అందేలా చూడాలని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ కేబీఎస్ ప్రగతి తెలిపారు. నగరంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో గల ఎంఎల్ఎస్ పాయింట్‌ను గురువారం ఆమె పరిశీలించారు. గోదాములోని బియ్యం, పంచదార, కందిపప్పు నిల్వ వివరాలను ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌ఛార్జి అజీజ్‌ను అడిగి తెలుసుకున్నారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో తెనాలి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో నిరుద్యోగ యువతకు రెండు నెలల పాటు నైపుణ్య శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి పి.ప్రణయ్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సంస్థ ద్వారా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో స్కిల్ హబ్స్‌ను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు వివిధ రకాల ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ కోర్సులతో ఉచిత శిక్షణనిస్తున్నట్లు గుర్తుచేశారు. శిక్షణ అనంతరం వారికి స్థానికంగా, ఇతర రాష్ట్రాల్లోని పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తెనాలిలోని గవర్నమెంట ఐటీఐలో ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్స్, టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్‌లో శిక్షణనివ్వనున్నట్లు తెలిపారు. 8వ తరగతి, ఆపైన విద్యార్హత కలిగినవారు శ్రీవల్లి 86395 42796ను సంప్రదించాలని కోరారు. తెనాలిలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్‌లో సర్వేయర్ ఎయిడ్, అసిస్టెంట్ ప్లంబర్ జనరల్‌లో శిక్షణనిస్తారని తెలిపారు. 8వ తరగతి, ఆపైన పాస్ లేదా ఫెయిల్ అయినవారు ఈఎస్ శ్యామ్‌బాబును 9866404344ను సంప్రదించవచ్చని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు http://surl.li/fsfdd లింక్‌పై క్లిక్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వివరించారు.